

# కంసుడి సమ్మె

వి.యస్.భారతి

కంసుడు సమ్మెచేస్తున్నాడు. మూడు రోజులనుండి నిద్రాహారాలు మానేశాట్ట. అయినా పిల్లవాడు మంచులో తడిసిన పువ్వులా నవనవలాడుతున్నాట్ట. 'వీడు పిల్లాడు కాదమ్మా. ఆ శ్రీకృష్ణ భగవానుడే కంసుడై పుట్టాడ'న్నమాట యిరుగు పొరుగునోట్లో నానిపోతోంది నువ్వుగింజలాగా.

శంకర్రావు యింటిముందు బోలెడు జనం పోగవుతున్నారు. పగలంతా కాళీ వుండడంలేదు.

"ఎందుకు చేస్తున్నాట్ట?"

"తెలీదు."

"ఏమిస్తే మానతాట్ట."

"తెలీదు."

"దగ్గరకి వెళ్ళకండి, విసుక్కుంటున్నాడు."

ఇలాంటి మాటలే వినపడ్తున్నాయి అందరినోటా.

చిట్టి ఒక్కత్తిమాత్రమే దగ్గర కెళ్తుంది. మిగిలిన వాళ్ళెవరొచ్చినా దూరంగానే వుండిపోతున్నారు.

క్లాసు పుస్తకంలో వున్న గాంధీ తాత బొమ్మచింపి ముందుపెట్టుకున్నాడు కంసుడు. తదేకంగా ఆయనకేసిచూస్తూం టాడు అప్పుడప్పుడు.


* * *

ఇరవైనాల్గు సంవత్సరాలక్రితం ఓ రాత్రి మూడుగంటలవేళ పోనీ తెల్లవార గట్ల మూడుగంటలవేళ ఓ సుబ్బారా యుడిగారి పెళ్ళాం మా లక్ష్మమ్మ ఓ అమ్మాయిని కన్నది. ఆ అమ్మాయి ఎదిగి ఎదిగి ఓ శంకర్రావుకి పెళ్ళామై ఆరు సంవత్సరాలక్రితం ఓ కుర్రసన్నా సిని నేలమీదకు తెచ్చింది.

మాలక్ష్మమ్మ కన్న పిల్ల సరోజ.

శంకర్రావు పెళ్ళిచూపుల కెళ్ళి నప్పుడు వారగా, సిగ్గుగా, కంగా రుగా ఉన్న సరోజను చూసినప్పుడు ఎర్రంచు ఆకుపచ్చ చీరకుచ్చిళ్ళు తొల గించుకుని తొంగిచూస్తున్న రెండు మెత్తని తెల్లనిపాదాలు కన్పించినప్పుడు అవొక్కసారి తనతో నడిస్తే బాగుండు ననిపించింది. మరోసారి ధైర్యంగా చూసేసరికి వాలెదేసికళ్ళు సగంరెప్పలు వాల్చుకుని ముక్కువంక చూడంటున్న ట్లుంటే సరేనని అటుచూశాడు. సగం పైగా అందం నేనే నని బడాయిచేస్తూ కన్పించిందది. ఎవరో కితకితలు పెట్టేరు కాబోలు, కమలాఫలం తొన ల్లాంటి పెదాలవెనక ముద్దులు మూటగట్టే పలుకపుస నవ్వింది. అమ్మాయి ది పచ్చగా పండుపండు ఛాయ గుండ్రంగా బొద్దుగా గుమ్మడి పండులా కాక, నాజూగ్గాతీగలా అజంతాబొమ్మ ఆశ్చర్య పడేలా ఉంది. ంత అందమైన పిల్ల నామెళ్ళో తాళికడ్తుందా అని కంగారుపడి, విచారపడ్డాడుట శంకర్రావు ఆ రోజున. ఆ అమ్మాయి పెళ్ళాం అయితే అదివర కటి అరుణనీ, కమలనీ, లక్ష్మినీ, ఎట సెటరాలనీ మర్చిపోయి నువ్వేం అడి గితే అది యిస్తానని వెంకటేశ్వర స్వామికి ప్రామిస్ చేశాడనికూడా చెప్తూం టారు. మాటయిరాపు కనక సరిపో యింది. లేకపోతే సరోజ శంకర్రావుకు దక్కేదికాదు.

శంకర్రావూ చూడచక్కని పిల్ల వాడే! చామనఛాయన్న మాటేగాని చేయెత్తుమనిషి. కళ్ళలో సైడుహీరో వెలుగుంది. అదృష్టం బాగుండి కాబోలు బి. ఏ. పూర్తి చెయ్యకుండానే బాంకులో చేరి నాల్గువందలు తెచ్చుకుంటూ వుంటు న్నాడు. సరోజకి శంకర్రావంటే ఇష్టం. శంకర్రావుకి జుట్టు నుదుటిమీద పడ్తుం దట ... అంతే కాకుండా పిల్లగా కాటు కలా మెత్తగా వెల్వెట్‌లా ఉంటుందని మురిసిపోతుంది. అదీచాలక అమృతం లాంటి మనసుందనికూడా చెప్తుంది అడిగితే.




శంకర్రావుకి సరోజా—సరోజకి శంకర్రావూ అంటే యిష్టం.

మరి సరోజ కంసుడ్ని కన్నది. పాపం! మొగుడూ పెళ్ళాంకలిసి వాడికి ముద్దుగా 'కృష్ణా!' అని పేరుపెట్టారు. వాడిచేష్టలు మరీ కృష్ణుడి చేష్టలు గా వుండటంతో చుట్టుప్రక్కలవాళ్ళు విసుగెత్తి రాక్షసు డన్నారు. పోపీ అబ్బాయికి దిష్టన్నా తగలకుండా వుంటుందీ 'కంసు'డని పిలవండమ్మా అని సలహా యిచ్చింది కుర్రసన్నాసిచేత రోజూ ఓసారన్నా గుద్దులు తినకుండా వుండని కుళలం పడినగారు. కంసుడి కథలు చాలానే వున్నాయి. చాలానే వుంటాయి. నెమ్మదిగా చెప్పుకోవచ్చు.

కంసుడికి వాళ్ళమ్మరంగే వచ్చింది. వాళ్ళనాన్న జుట్టులాగే కాటుకలా వెల్వెట్లా వుంటుంది. నుదురుకు అంటుతూ తలవెనకనుంచి ముందుకి దువ్వినట్టుండి రోమను రాకుమారుడి మొహంలా వుంటుంది. చురుకైన కళ్ళు — కొంచెం చిన్నవొచ్చాయి. ఎక్కడున్నంచో—, చివర్లో కొంచెం పైకి తిరిగినట్లుండే ముక్కూ—చాలా కొట్టొచ్చినట్లు కన్పించే పిల్లడు. బలంగా జాంపండులావుంటాడు. వాళ్ళనాన్నందుకనే వాడ్ని 'ఒరే జామపండూ!' అంటాడు కొంచెం ధైర్యం పుంజుకున్నప్పుడూ — వాడు మాంచి మూడులో వున్నపుడూ.

ఈ కథాకాలంనాటికి ... జూన్ నెల

16 వ తారీకు 1968 వ సంవత్సరంలో సాయంకాలం. ఎండ మాంఛి ప్రచండంగా వుంది. సూర్యుడు మావోసేటుంగ్‌లా మండిపడుతూంటాడు పగలంతా. బాగా సాయంకాలం అయినా వేడి పూర్తిగా తగ్గలేదు. వెచ్చగా, ఉక్కపోతగావుంది వాతావరణం. శంకర్రావు యింటిముందు కొబ్బరిచెట్టు నీడపొడుగ్గై పొడుగు పొడుగ్గై పడగ్గదిదాకా సాగి వచ్చింది. 'కృష్ణ దేదీ!' అనుకుంటూ వీధిలోకి వచ్చిన సరోజకు ఉసూరుమంటూ స్కూటర్‌మీద కూర్చున్న శంకర్రావు కన్పించాడు. చొక్కా బొత్తాలు సగందాకా యిప్పుకునే వున్నాయి. పాంటులోపల వేసిన చొక్కా వదులు వదులుగా బయట కొచ్చింది, గాలిపోయిన బుడగలాగా. నుదుటి మీద చెమటబిందువులు ప్లాస్టిక్ గుడ్డమీద పడినట్లు మెరుస్తున్నాయి

"సరోజా!" అన్నాడు నీరసంగా శంకర్రావు.

"సరోజా!" అన్నాడు బలం పుంజుకుని – "కృష్ణ లేనట్టున్నాదే!"

"ఏం?" అన్నట్లు కళ్ళు పెద్దవి చేసింది ఆవిడ.

"ఇటురా!"

బంగారు పాదాలు స్కూటరువైపు నడిచాయి. స్కూటరు దిగి ఆవిడ భుజంమీద చెయ్యివేసి మూడొంతులు బరువు అక్కడపారేసి 'లోపలికినడు' అన్నాడు శంకర్రావు. కొబ్బరిచెట్టు పక్కన మందారచెట్టు, గన్నేరుచెట్టూ పెద్దగుబురుగా వుంటాయి నేలదాకా కొమ్మలొచ్చి. ఆ కొమ్మలకింద కూర్చుని ఓ బొద్దుకుర్రాడు మాంఛి ఆలోచనలో వున్నాడు. అతగాడే కంసుడు. శంకర్రావు కొడుకు కంసుడు. మందారచెట్టు మీదకు పాకుతున్న చీమల విన్యాసాలు చూస్తున్నట్లున్నాడు బహుశః.

"సర్...జా" అన్న అపసవ్యపు పిలుపు వినబడి చిరాగ్గా 'ఈ నాన్నగారికి బొత్తిగా తెలుగురాదు' అనుకున్నాడు. రెండు చిన్నకళ్ళూ స్కూటర్‌వేపు కదిలాయి. అక్కడి పరిస్థితుల్లో 'డేంజర్' ఎక్కువైనట్లు అనిపించడంవల్ల అవి పెద్దవయ్యాయి. కంసుడు చూపుడువేలు ఆలోచిస్తూ ముక్కుకిందకి వెళ్ళింది.

"నాన్నగారు అలాచూస్తారేం అమ్మకేసి–ఆదేదో సినిమాలో ఆ పొడుగాటి కుర్రాడిలాగా...అమ్మ అలా ముసిముసిపోతుందే ... ఇదేదో చాలాదూరం పోతుం" దనిపించింది కంసుడికి.

అంతలోనే వాడికి వీపుమీద ఎవరో చరిచిన ట్లయ్యింది. నాన్నగారు అమ్మ భుజంమీద చెయ్యేసి ...., ముక్కుకింద వేలు ఈ లోపలనోట్లో పళ్ళమధ్యకెళ్ళింది. అవి గట్టిగా వత్తాయిదాన్ని. 'వెధవపళ్ళు, వెధవవేలు' అంటూ విసుక్కుని బయట తీసిపడేశాడు దాన్ని. ఈ లోపల హీరో హీరోయిన్ని తీసుకు

లోపల కెళ్ళిపోయాడు. గుట్టుగా చెట్ల మధ్యనుంచి బయట కొచ్చాడు కంసుడు.

వా ళ్ళింట్లో మధ్య నడవావుంది. ఆ నడవాకి యిటునుండి అటుపరకు పైన ఒక అటకలాంటిది వుంది. ఆ అటకమీద పెట్టెలూ, బట్టలబుట్ట ... అలాంటి సామాను చక్కగా అమర్చి వుంటుంది. అంది మీదకెక్కితే పడగ్గది చాలామటుకు వస్తుంది. పెరట్లో నూతివరకూ, వంటింట్లో దేముడి గూడు వరకూ, వీధిలో గేటుదగ్గర కొంత భాగమూ చూడొచ్చు. ఇవన్నీ ఆ ఆ వైపుల వెంటిలేటర్లద్వారా కనపడేచోట్లు ... అటక ఎక్కేందుకు మెట్లలాంటి వున్నాయి.

కంసుడు అర్జెంటుగా నడవా వరకూ వెళ్లాడు. అక్కడ వాడికి పెద్దాళ్ళెద్దరూ కన్పించలేదు. అటక ఎక్కి పెట్టెల వెనకాల ఒదిగి కూర్చుని కళ్లు వీలయినంత వెడల్పుచేసి కూర్చున్నాడు. వాడిదగ్గర ఒక వింతరకం ఆయుధంవుంది. అది స్వయంగా తయారుచేసుకున్నది. దాని పేరు 'కంసూట్'. ఎంతో క్లిష్టపరిస్థితుల్లోతప్ప దాన్ని వాడడు కంసుడు. దానికంటే తక్కువరకం ఆయుధాలు అనేకం వాడకంలో వుంటూంటాయి సాధారణంగా - విల్లమ్ములు, రాకెట్లు, గులకరాళ్లు... వగైరా... వగైరా... వాడి 'కంసూట్'తో వదిహేనుగజాల వరకూ యుద్ధం సాగించవచ్చు. 'కంసూ'ట్ యించుమించుపిల్లస గ్రోవిలా వుంటుంది. ఒకవైపుబిరడాపెట్టి అందులో ఒక కన్నంచేసి బలమైన రబ్బరుతాడు దూర్చాడు. బిరడా బయట చిన్న సోడా మూతకు కన్నంపెట్టి రబ్బరు ఊడిపోకుండా ముడివేశాడు పెద్దగా; ముందువైపు పైన ఒక కన్నంచేశాడు. ఆ కన్నానికి కొద్దిగా వెనకాల ఒక రేకుబిళ్ళ వుంటుంది. ఆ బిళ్ళకు వెనకవైపుముందు చెప్పిన రబ్బరు ముడేశాడు. రెండవ వైపు మరొక రబ్బరు బిగుతుగాకట్టి ముందువైపు కన్నంలోంచి బయటికి తీసి వెనక రబ్బరుతో కట్టేశాడు. ఆయుధం ముందువైపు నయాపైసా అంతసందు మిగిల్చాడు కోసుగా; అందులో వాడే మందుగుండ్లు రెండు రకాలు. పల్చని కాగితంలో కారం (గుంటూరు కారం అయితే మరీమంచిదీ, శ్రేష్టమూను) గానీ, దూలగొండాకు పొడిగాని గట్టిపొట్లం కుంకుడుగింజంత - ముందువైపుకన్నంలోంచి'కంసూట్'లో వేస్తాడు, బిళ్ళ వెనక్కి బలంగా లాగి. కారం అయితే శత్రువు మొహం మీదికి, దూలగొండాకు అయితే మెడ మీదికి గురిచూసి విడిచిపెడ్తాడు. శత్రువుని చేరేసరికి పొట్లంవదులై మందు ఆయా ప్రాంతాలమీదపడి కన్నీళ్ళూ, ముక్కునీళ్లూ, కేకలూ, పెడబొబ్బలూ లాంటి విన్యాసాలకు ప్రారంభం పలుకుతుంది. అవికాకుండా పల్లేరుకాయలు కూడా వాడుతుంటాడు దానితో. పల్లేరు కాయలైతే కాలి ఎముకలమీదికి గురి చేస్తాడు. కంసుడు ఈ ఆయుధంమీద సుమారు రెండునెల్లకాలం ఖర్చుపెట్టాడని వాళ్ళమ్మ నాతో స్వయంగా చెప్పింది.

(కంసుడి యిల్లు మా యింటికి మూడి కృపతల మాత్రమే వుంది.) యీ "కంసూట్" కేవలం దుష్టశిక్షణకోసం మాత్రమే వాడుతాడు కంసుడు. ఇక్కడ కంసు డిట్లా వుండగా ...

నూతిదగ్గర ...

"కృష్ణుడు లేనట్టున్నాడే'" అన్నాడు మళ్ళీ శంకర్రావు.

"లేదండీ! గంటసేపట్నుంచి చూస్తున్నాను - చేగోణీలు పెట్టాలని ఎక్కడా కన్పించలేదు," అంది సరోజ.

"ఓ చేదెడు నీళ్ళుతోడు సరోజా!"

సరోజ నూతిలో చేదవేసింది.

"ఉండు సరోజా! అలాగేవుండు... నువ్విప్పుడెలా వున్నావో తెలుసా?"

"ఎలావున్నా నేవిఁటి?" గోముగా అడిగింది సరోజ.

"భగీరథుడు నేలమీదకు తీసుకొచ్చిన గంగ ఉరుకులెత్తేటపుడు పుట్టిన నురగలా వున్నావు. పచ్చని ఈ నీరెండలో పచ్చ గన్నేరు పూదండలా వున్నావు."

"బాగుంది. అన్నీ చూసినట్లు మాట్లాడుతున్నారు. మొహంకడగండి." గలగలా నవ్వింది సరోజ.

"సరూ... సరూ..."

"అబ్బ! ఏమిటి శంకర్రావుగారూ ఈ అల్లరి..." చేతులు చెంగుకు తుడుచుకుంటూ వంటింట్లోకి వెళ్ళబోయింది సరోజ.

"ఇదుగో అమ్మాయ్... నీకాలికెంత బురదయిందో చూడు." అంటూ దగ్గర కొచ్చాడు శంకర్రావు.

"అదుగో కృష్ణుడొచ్చాడండీ!"

ప్రక్కలో బాంబు పడినట్లయింది శంకర్రావుకి .. గబగబా సబ్బుతీసుకుని మొహం పరపరా తోమేశాడు

"నా పిచ్చిశంకరం" అనుకుంటూ వంటింటి గుమ్మంనుంచి వెక్కిరించింది సరోజ.

పది నిమిషాలవరకూ అలా తోము తూనే వున్నాడు శంకర్రావు. పదకొండో నిమిషానికి మరింక సబ్బుదొరకలేదు... అసలే అయిపోవచ్చింది.

కాఫీగ్లాసొచేత్తో, దువ్వెనో చేత్తో పట్టుకొని గుమ్మందగ్గర నిలబడింది సరోజ. మొహం తుడుచుకుంటూ వచ్చాడు శంకర్రావు. గలగలమంది సరోజ. విల విల లాడాడు శంకర్రావు.

ఓచుక్క కాఫీ సేవించాడు శంకర్రావు.

"అమృతంలావుంది సరూ... కాస్త తాగిచూడు"

సరోజ ఓమారూ, శంకర్రావు ఓమారూ కాఫీతాగడం పూర్తయింది.

"ఈరోజు సాయంకాలం చాలా బావుంది కదమ్మాయ్" పడగ్గదివేపు వెళ్తూ అన్నాడు శంకర్రావు.

"ఏంచేద్దాం చెప్పండి?" అతని వెనకే అడుగేస్తూ అంది సరోజ...




"కృష్ణుడు యింట్లో లేడు కదూ సరోజా!"

"లేడనే అనుకోవాలిమరి!"

"అతలుపు దగ్గరగా వెయ్యరాదూ!"

"ఎందుకులెస్తురూ..." తలుపు దగ్గరగావేసి గడియలాగింది సరోజ.

"సరోజా... నువ్వెంత బాగున్నావో తెలుసా!"

"తెలుసు ..."

కంసుడికి యిదంతా కన్పిస్తూనేవుంది. మాటలుమాత్రం వినిపించటం లేదు. "ఏమిటో యీకుట్ర నామీద" అనుకున్నా డొకసారి.

"ఏంతెలుసు...సరోజా ?"

"నేను అజంతాబొమ్మకి అమ్మమ్మలా వున్నానంటారు..."

"కాదు! మనవరాల్లా వున్నావు"

"సరోజా; నీపెళ్ళిచూపుల కొచ్చి నప్పుడు ఓగమ్మత్తు జరిగింది. చెప్పనా?"

"నేచెప్తాను... వినండి!..."

బుద్ధిగా వినసాగాడు శంకరం.

"మీరు సాయంత్రం షికారు కెళ్ళి నవుడు... మీకు కందిచేను దగ్గర పెసర గింజకాంటి చిన్నదీ, శనగ గింజలాంటి చిన్నవాడూ కన్పించారు... చిన్నది మోకాళ్ళపైకి చీర గోచీకట్టు కట్టి నెత్తి మీద పచ్చగడ్డి మూటపెట్టుకు నిలబడింది. అవటా చిన్నవాడు అన్నాడుకదా...

"ఒసేవ్ పైడీ, పైడీ... అదాటున నే గుర్తొస్తే ఏంచేత్తవ్ చెప్పే!'–'సన్న బియ్యం కూట్లోకి ఉల్లిపాయపుల్సు జేసి సేవిగట్టుమీదకొచ్చి సెట్టనక, పుట్టనక, ఎతికి సెయ్యట్టుకుంటే నోరటమంట మావా! ఎందుకడిగినావ్ సెప్పుమావా!" 'కాదులేయే.'

"చూడు సరోజా:... కాలంవృధా అయిపోతోందిగానీ..." అంటూ అడ్డం తగిలాడు శంకర్రావు.

"కృష్ణుడెలాగా యింట్లోలేడు కనక అలాషికారు పోయొద్దాం ఓ గంటసేపు. బట్టలు మార్చుకోదలిస్తే మార్చుకో!"

"సరోజా! అర్జంటు... ఈలోపల కొంచెం పనుంది..."

"వ్యవహారం ముదురుతోంది" అనుకున్నాడు కంసుడు.

శంకర్రావు సరోజకి దగ్గరగా, చాలా దగ్గరగా వచ్చేశాడు. రెండు చేతులూ భుజాలమీద వేసేశాడు. సరోజ నవ్వుతోంది... మెడ నిమురుతున్నాడు వేళ్ళతో నెమ్మదిగా... ఇద్దరి మొహాలూ దగ్గర కొచ్చేశాయి. కంసుడు ఆత్రంగా చూస్తున్నాడు. 'ఛ!... నాన్నగారు అమ్మ పెదాలు కొరుకుతున్నారు...అమ్మ అరవదే... తిరిగి కొరుకుతుందా.. ఛ! ఎంగిలి మనుషులు...' కంసుడికి కోపం వచ్చింది. చూసింది చాల్లే అనుకున్నట్లు గబగబా లేచి కిందికి దిగొచ్చాడు. గుమ్మంముందు అసహనంగా నిలబడ్డాడు.

ఆమధ్య సరోజ ఓసారి కంసుడికి కొత్తలాగూ, చొక్కాలేసి 'జాంపండే' అంటూ ముద్దెట్టుకుంటే దూరంగావెళ్ళి నిలబడి చెప్పాడు – ముద్దుఖరీదు మూడు పైసలని. మరోముద్దు పెట్టుకుని వాడికి ఐదుపైసలు యిచ్చింది సరోజ. 'అమ్మకసలు ఏం తెలీదు. నాకు ఎంగిళ్ళంటే యిష్టంలేదని తెల్సుకోదేం' అంటూ కోపంపడ్డాడు కంసుడు. వాడిమెదడు తీవ్రంగా ఆలోచించడం మొదలుపెట్టింది. మంచి అయిడియా మొలిచింది కాసేపట్లో.

తలుపులు తెరుచుకుని సరోజా శంకర్రావులు... సరోజ భుజంమీద శంకర్రావుచెయ్యి... చటుక్కునచూసి తల దించుకున్నాడు కంసుడు. కంసుడ్ని చూసి యిద్దరూ అవాక్కై దూరంగా జరిగారు. 'నాన్నగారు ముసలివారై పోతున్నారు' అనుకున్నాడు కంసుడు. వాడి తాతగారు కర్రనానుకోడం చూశాడు వాడు.

సరోజ గదిలోకెళ్ళేముందు తెల్లచీర. ఇప్పుడు ఎర్రచీర కట్టుకుని నల్లజాకెట్టు తొడుక్కుంది. ఈ మార్పు చూసి – మనస్సులో చిరాకుపడి తల పంకించాడు కంసుడు.

"ఎక్కడున్నావురా యింతవరకూ" అంటూ కొడుకు తలమీద చెయ్యి వెయ్యబోయింది ముందుగా తేరుకున్న సరోజ.

"జుట్టు రేగిపోతుందని తెలీదు

కాటోలు" అన్నాడు బుంగమూతిపెట్టి కంసుడు.

చెయ్యి వెనక్కి లాక్కుంది సరోజ.

"నాన్నగారూ!" అంటూ హుంక రించాడు కంసుడు.

ఉలిక్కిపడ్డాడు శంకర్రావు.

"ఊఁ!" అన్నాడు ఏడుపు మొహంతో;

"నాకో అయిదు రూపాయిలు కావాలి. ."

"ఎందుకురా?"

"ఎంతధైర్యం?" అని మనసులో చిరాకుపడ్డాడు కంసుడు.

"అర్జంటుగా తాతగారి ఊరువెళ్ళి ఆయన్ని తీసుకురావాలి" కంసుడి తీక్ష్ణమైన మొహంచూసి ఫక్కుమన్నారు సరోజా శంకర్రావూ... ఓక్షణం కళ్ళు మూశాడు కంసుడు.

"మీ నవ్వులయ్యాయా!" అన్నాడు కళ్ళుతెరిచి.

"తాతగారెందుకురా జాంపండూ!" అంది సరోజ.

"జాంపండుకాదు ... కృష్ణుడనో, కంసుడనో పిలు"

"అయిదు రూపాయలిస్తారా యివ్వరా?" మూడుసార్లు అడిగాడు.

శంకర్రావు యివ్వనన్నాడు.

'సరే వెళ్ళండి' అని విసవిసా నడిచి వీధరుగుమీద కూర్చుని ఆలోచిస్తున్నాడు తీవ్రంగా. 'అంత అయిడియావేస్తే లాభంలేకపోయిందే' అనుకుంటున్నాడు.

సరోజా, శంకర్రావూ తలుపులు తాళంవేసుకుని బయటికెళ్ళడానికి సన్నాహమౌతున్నారు.

"షికారుకెళ్దాం వస్తావురా కృష్ణుడూ:" అనడిగారు స్కూటరుమీదకూర్చుని.

"నేను రాను - మీరు వెళ్ళవచ్చు" అన్నాడు ఎడమొహంపెట్టి చిరాగ్గా.

నవ్వుకుంటూ తుర్రుమన్నారు స్కూటరు మీద వాళ్ళిద్దరూ; 'ఇక్కడేవుండు' అని చెప్పికూడా వెళ్ళారు నవ్వులమధ్య కాస్త తెరిపిచేసుకుని.

'హుఁ!' అనుకున్నాడు కంసుడు ఆలోచన చేస్తూ చేస్తూ యిటూ అటూ చూస్తూ కూర్చున్నాడు.

మోకాళ్ళక్కొంచెం కిందగా ఉన్న పరికిణీ కట్టుకుని పువ్వులజాకెట్టు తొడుక్కుని కొటుకకళ్ళు యిటూ, అటూ సారిస్తూ ముద్దుగా నడిచివస్తూన్న చిట్టి కన్పించింది కంసుడికి. చిట్టికీ వాడి వయసే వుంటుంది. కంసుడికోసమే బయలుదేరినట్టుంది. వాడ్ని చూడగానే ఆటొచ్చింది.

"ఆడుకుందాం రారా కంసుడూ!" అంది దగ్గరకొచ్చి.

"ఇప్పుడాట లేవిటే" అంటూంటే దానిచేతిలో పెద్ద పొట్లం కన్పించింది వాడికి.

"నీకోసమే తెచ్చానార్రి కంసుడూ,"

అంటూ పొట్లం యిప్పింది. దాంట్లో దోసెడు జంతికముక్కలూ, పెద్ద నిమ్మకాయంత మినపసున్నివుండా వున్నాయి. వెంటనే వాటి నుద్ధరించడానికి పూనుకున్నాడు కంసుడు.

"ఒసే చిట్టీ ఎక్కడివే యివి ?"

"ఓ... యింకా చాలా వున్నాయి తెలుసా ?... పెద్ద గంపలో తెచ్చింది మా అమ్మ."

"మిఠాయివుండలుకూడావున్నాయా?"

"ఓ ఉన్నాయి."

"అవెందుకు తేలేదు..." విసుక్కున్నాడు కంసుడు.

"మీ అమ్మతో మొన్న పెళ్ళికెళ్ళావు కదూ !" అన్నాడు కాసేపాగి కళ్ళు మూసుకుని. "పెళ్ళివాళ్ళిచ్చివుంటారు" అనికూడా అన్నాడు.

తనముందు కూర్చున్న జ్ఞానివేపు భక్తితో చూసింది చిట్టి.

తినడం పూర్తిచేసి, కుళాయిదగ్గర కెళ్ళి మంచినీళ్ళు తాగివచ్చాడు కంసుడు.

"ఆడుకోడానికి రారా కంసుడూ..." అంది మళ్ళీచిట్టి.

కంసుడు మాట్లాడలేదు.

"చిట్టీ ! నువ్వు మంచిదానివి" అన్నాడు ఓ నిమిషం తర్వాత.

సిగ్గుపడింది చిట్టి.

"నీకు మాంఛి మొగుడొస్తాడు" అన్నాడు దృఢనమ్మకంతో.

"మొగుడంటే...పెద్దగా మా నాన్నలాగా. మీనాన్నలాగా వుంటాడు కదురా..."

"చిట్టీ ! నీవన్నీ ఉత్త పాలపీకి ప్రశ్నలే...వేస్తే సిగరెట్‌లాంటి ప్రశ్న లడగాలి...తెలిసిందా ?"

"తెలిసింది" అంది తలపంకుకుని చిట్టి.

"చిట్టీ... సమ్మె చెయ్యాలనుకుంటు న్నానే నేను..."

"సమ్మె అంటే ఏమిట"ని అడగబోయి తమాయించుకుంది చిట్టి.

"హుం !" అన్నాడు కంసుడు. ఆవలించకముందే పేగుల్లెక్కపెట్టాడు మరి.

"సమ్మెఅంటే సత్యాగ్రహం అన్నమాట. గాంధీతాతమాట విన్నావుగా... ఆయన అస్తమానూ చేసేవాట్ట. సత్యాగ్రహం చేసేటప్పుడు అన్నం తినరన్నమాట..."

"గాంధీతాత కస్తమానూ జొరం వచ్చేదన్నమాట..." అంది చిట్టి. తెలిసిందన్నట్లు కళ్లు గుండ్రంగా తిప్పి.

"అబ్బబ్బ ! అది లంఖణంఅంటారు. ఇదివేరు. దీన్ని నిరాశవ్రతం అనికూడా అంటారు..."

"అంటే ?"

"నీకు కోపం వచ్చిందనుకో..." అని పది నిమిషాలసేపు నిరశనవ్రతం గురించీ, వాళ్ళమ్మా నాన్నా చేసిన నేరం గురించీ, దానికివాడు ప్రతిఘటన తెలియ




బర్చ దల్చుకున్న విధానం తెలియజేశాడు. నిరశనవ్రతం చేస్తే చచ్చిపోతారని, అప్పుడు అల్లకల్లోలం జరుగుతుందనీ... అంతవరకూ రాకుండా వ్రతం చేసేవాడి కోర్కెలు తీరుస్తారనీ ఘట్టిగా చెప్పాడు. ఆంధ్రరాష్ట్రం రావడానికి పొట్టిశ్రీరాములు చనిపోయిన వైనంకూడా తెలియచేశాడు

"నువ్వు చచ్చిపోకురా కంసుడూ... నేను మంచిదాన్ని కదురా... నీతో ఎప్పుడూ దెబ్బలాడనురా!" అంది చిట్టి ఏడుపుమొహంవేసి.

ఆ తర్వాత చిట్టీ, వాడూ మరో పది నిమిషాలు మాట్లాడుకున్నారు. చిట్టి వాడికి పొద్దున్న ఎవరూ చూడకుండా గన్నేరు చెట్టు మొదట్లో మిఠాయివుండలూ ఆవీ పొట్లంకట్టి తెచ్చిపెట్టే ఏర్పాటుజరిగింది వ్రతం జరిగినన్నాళ్ళూ అలా చేస్తానని మాటయిచ్చింది చిట్టి. మిఠాయి కాకపోతే... ఏదో ఒకటి తెస్తానంది.

"ఆవకాయ ముక్కలు కడిగి తెస్తూండు" అన్నాడు కంసుడు చిట్టిని యింటిదగ్గర దిగపెట్టి వచ్చేముందు.

సరోజా, శంకర్రావూ వచ్చారు...

"నిద్రపోతున్నావా కృష్ణుడూ!" అన్నారు ఒక్కగొంతుకతో... ముఖం మరోవైపు తిప్పుకున్నాడు కంసుడు.

లోపలికెళ్ళిపోయారు ఇద్దరూ చిలకా గోరింకల్లా! లోపల పెద్ద శబ్దాల్లా వినిపించాయి.

'నవ్వుతున్నారు' అనుకున్నాడు కంసుడు.

ఓగంట గడిచింది .. అక్కడే కూర్చున్నాడు కంసుడు.

చేతులు తుడుచుకుంటూ వాళ్ళమ్మ వచ్చింది... "భోజనాలు చేశారన్న మాట" అనుకున్నాడు కంసుడు.

"కృష్ణుడూ ! అన్నానికి రావురా ?'' అంది వాళ్ళమ్మ బుజ్జగింపుగా.

"నే నివ్వాళనుంచి అన్నం తినను" అన్నాడు ఘనంగా.

అరగంటసేపు అడిగింది వాళ్ళమ్మ.

అరగంటలో మూడే ముక్కలు చెప్పాడు...

'నా కోపం వచ్చింది !'

'మీరు చేసిన పని నచ్చలేదు !'

"నన్ను చిన్నవాణ్ణనుకోవద్దు!"- అని.

మొదటి రెండు జవాబులూ ఎందుకు అన్న ప్రశ్నకి. చివరిది మా చిన్నవి కదూ, కన్నవికదూ అన్న అవమానా లకి.

సరోజ దాదాపు ఏడ్చినంత పని చేసి నట్టుగా కంసుడు అనుకున్నాడు... చివ రికి విసుగెత్తి వెళ్ళిపోయింది. ఆతర్వాత శంకర్రావు వచ్చాడు.... శంకర్రావు పావుగంటలోనే విసుగెత్తిపోయాడు. వెళ్తూ వెళ్తూ కంసుణ్ని యింట్లోకి తీసి కెళ్ళి పక్కమీద కూర్చోపెట్టాడు. 'పోనీ నిద్రపో' అని... కంసుడు అభ్యంతరం చెప్పలేదు.

ఒకరోజు... రెండు రోజులు... మూడురోజులు సాగింది కంసుడి నిరాశ వ్రతం.

సరోజ శంకర్రావు కంగారుపడిపో తున్నారు.

చిట్టిమూలాన కంసుడికి ఏలోటూ లేకుండానే సాగిపోతోంది. వీలుచూసు కుని మందార పొదలోకివెళ్ళివస్తున్నాడు. 'నా వెనకాలే పొదదగ్గర కొస్తే నే చచ్చి నంత ఒట్టు' అన్నాడు. వాళ్ళెదురు గుండా నీళ్లు మాత్రమే ముట్టుకుంటు న్నాడు

సరోజ కళ్ళమ్మట నీళ్లెట్టుకుంది.

శంకర్రావు ఆఫీసుకి సెలవు పెట్టు కున్నాడు. మూడ్రోజుల గెడ్డం పెరి గింది. రెండ్రోజుల్నుంచి పక్కిళ్ళవాళ్లు యిచ్చినకాఫీ మీదే వున్నారు చిలకా గోరింకా. ఒక్కసారిగూడా పడగ్గది వైపు వెళ్ళలేదు. నడవాలోనే వుంటు న్నారు యిద్దరూ... కంసుడు నడవా ముందున్న వీధి అరుగుమీద కూర్చుంటు న్నాడు పగటిపూట.

"ఆ తల్లికీ తండ్రికీ రెండురోజులై నిద్రలేదమ్మా" అని బోలెడు జాలిపడ్తు న్నారు వచ్చినవాళ్ళంతా.

పగలు పన్నెండుగంటలైంది.

"ఇంకా చిట్టి రాలేదేం చెప్మా !" అనుకున్నాడు కంసుడు. పదకొండోసారి చెట్టు మొదట్లోకి వెళ్ళివచ్చాడు.

కడుపులో కాలుతోంది.

సహనం చచ్చిపోతోంది.

చిట్టి వచ్చింది...దాన్నందరూ చుట్టు ముట్టారు.

"నువ్వన్నా చెప్పుతల్లీ ... ఎందుకు కంసుడు యిలా అయ్యా"డని అడిగారు.

చిట్టి కళ్ళు మిటకరించింది. నోరు కదపలేదు. అలాగని కంసుడు చెప్పాడు దానికి.

"చిట్టీ!" అని పిల్చాడు కంసుడు.

అందరూ దూరంగా వెళ్ళారు.

నీరసంగా నడుస్తూ వచ్చింది చిట్టి.

"తెచ్చావా?"

"దొరకలేదు"

"హుం!..." అన్నాడు కంసుడు. కళ్ళుమూసుకున్నాడు...కళ్లుతెరిచాడు... నవ్వాడు ...

ఈ చేష్టలన్నీ చేష్టలుడిగి చూశారు సరోజా, శంకర్రావూ. సరోజలో ఆశ వెలిగింది.

శంకర్రావుకు 'హోప్' కలిగింది.

మూడురోజుల తర్వాత నవ్వాడు కంసుడు.

కంసుడు నవ్వాడు.

ఇద్దరూ లేచారు...నడిచారు కంసుడి దగ్గరకి ...

ఏమిటన్నట్లు చూశాడు కంసుడు.

అందరూ ఊపిరి బిగపట్టి చూస్తున్నారు.

"కృష్ణుడూ!" అంది సరోజ.

"అమ్మా!" అన్నాడు కంసుడు.

"కృష్ణుడూ!" అన్నాడు శంకర్రావు.

"నాన్నగారూ!" అన్నాడు కంసుడు.

"కోపం తగ్గలేదా?" అన్నారు ముక్తకంఠంతో.

"హుం!" అన్నాడు కంసుడు.

"చెప్పరా!" అన్నారు ఒక్క గొంతుకతో.

"చెప్తాను ... లోపలకి పదండి." అన్నారు కంసులవారు.

మొగుడూ పెళ్ళాం ముఖాలు చూసుకున్నారు.

శంకర్రావూ, సరోజా, కంసుడూ, చిట్టీ లోపలికి కదిలారు. జనం బిక్కచచ్చిపోయి. అడుగు నేలకు పాతుకుపోయినట్లు నిలబడ్డారు.

లోపల ...

"చిట్టీ!" అంటూ గట్టిగా దాన్ని ముద్దుపెట్టుకున్నాడు కంసుడు ...

శంకర్రావు క్కోపం వచ్చింది.

"ఏమిటా వెధవపని!" అన్నాడు కంసుడి చెవిపట్టుకుని ...

"చెవి వదలండి!" అన్నాడు కంసుడు

"వదలండీ!" అంది సరోజ ఏడ్పు మొహంపెట్టి.

"హుం!" అన్నాడు శంకర్రావు ... చెవి వదిలేశాడు.


"నే చేసిం దేంపని నాన్నగారూ!" అన్నాడు కంసుడు గంభీరంగా

"వెధవపని" అన్నాడు శంకర్రావు రపీమని.

సరోజ భయంగా చూసింది.

"వెధవపని ... పెద్దవాళ్ళు చేస్తే మంచిపనా?"

జవాబులేదు.




"హుఁ! అందుకే ఈ సత్యాగ్రహం చేశాను ... ఎంగిలి తినకూడదని మీరేగా చెప్పారు...మీరూ...అమ్మా... యింకెప్పుడూ చెయ్యకండి.. సత్యాగ్రహం ఆపేస్తున్నాను...యిక వెళ్ళండి!"

సరోజా శంకర్రావూ నవ్వుతున్నారు. విరగబడి నవ్వుతున్నారు. సరోజ భుజం మీద చెయ్యివేసి నవ్వాడు శంకర్రావు. కంసుడు, చిట్టి వెనక్కి తిరిగి నుంచున్నారు.

"హుఁ!" అన్నాడు కంసుడు.

"హుఁ!" అంది చిట్టి.

"ఇంక నవ్వకండి! అమ్మా వంట చెయ్" అని చిట్టిని తీసుకుని పెరటివేపు వెళ్ళాడు కంసుడు.

వీధిలో జనం అరుస్తున్నారు.

శంకర్రావు అరుగుమీద కొచ్చాడు.

"మా కృష్ణుడు సమ్మె ఆపుచేశాడు."

ప్రశ్నలమీద ప్రశ్నలువేశాడు జనం. శంకర్రావు దేనికీ జవాబు చెప్పలేదు. ఆకాశంవైపు చూపించాడు.

జనం ఆకాశంకేసి చూశారు. తల పంకించారు...'అంతా భగవత్సంకల్పం' అన్నారు...చేతులు జోడించారు.

పిల్లలు అర్థంకాక తెల్లమొహం వేశారు. సరోజ స్టౌ వెలిగించింది. శంకర్రావు అద్దంముందు కెళ్ళాడు రేజరూ ఎటసెటరా తీసుకుని.

కంసుడి కీర్తి, సముద్రంలా పొంగుతోంది చుట్టుపట్ల...

తిలకించాడు స్వర్గలోకంలో కృష్ణుడు.

"సత్యా! మన చిరంజీవి పేరు తెచ్చుకుంటున్నాడు."

సత్యాదేవి బోసినవ్వు నవ్వింది బొ వన్నట్లు.